

రన్యారావ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నటి రన్యారావ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను బెంగళూరులోని ఆర్థికనేరాల ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. రూ.15 కోట్ల విలువైన బంగారాన్ని తీసుకొస్తూ ఈనెల 3న బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో పట్టుబడిన విషయం తెలిసిందే. డీఆర్ఐ, సీబీఐ అధికారులు విచారణ జరుపుతున్నారు. తాజాగా ఈడీ కూడా రంగంలోకి దిగింది. రన్యారావ్ తరఫు న్యాయవాదులు బెయిల్‌కోసం పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిగింది. ఆమె తరఫున కిరణ్‌జవులి వాదించారు.

గ్రేటర్ బెంగళూరు బిల్లుకు ఆమోదం





- ఉద్యాన నగరికి కొత్త ఊపు
- రూపు దిద్దుకోనున్న 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ'
- బిజినెస్ కారిడార్‌కు రూ.26వేల కోట్ల రుణం
- 40 కిలోమీటర్ల సొరంగమార్గ నిర్మాణం
- పలు కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వం శ్రీకారం



టన్నెల్ రోడ్

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం ఐటీ బీటీ, ఎంఎన్‌సీ కంపెనీల ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు కలిగింది. బ్రాండ్ బెంగళూరు ద్వారా నగర రూపురేఖలు మార్చాలని భావిస్తున్న ప్రభుత్వం వేగంగానే అడుగులు వేస్తోంది. నగరంలో ప్రధాన సమస్యలైన ట్రాఫిక్, రవాణా సౌలభ్యాలు మెరుగుపరచదలిచారు. ప్రస్తుతం ఉన్న బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) ఏటా విస్తరించడంతోపాటు వలసలు వచ్చేసంఖ్య గణనీయంగా పెరగడంతో సదుపాయాలు సమకూర్చడం సవాల్‌గా మారింది. పైగా పాలనా వ్యవహారాలకు ఒకే కేంద్రం ద్వారా అసాధ్యమని 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' తెరపైకి వచ్చింది. ఆరు నెలల కసరత్తుకు ఒక రూపుదిద్దుకున్నట్లయ్యింది. ఎమ్మెల్యేల సబ్ కమిటీ రూపొందించిన గ్రేటర్ బెంగళూరు అథారిటీ ద్వారా తీసుకోవాల్సిన విధానాలపై సమగ్ర నివేదిక తయారు చేసి ఇటీవలే శాసనసభ స్పీకర్‌కు సమర్పించిన విషయం తెలిసిందే. తాజాగా మూడురోజుల సుదీర్ఘ చర్చల తర్వాత తొలుత శాసనసభలోను గురువారం విధానపరిషత్‌లోను గ్రేటర్ బెంగళూరు అథారిటీ బిల్లుకు ఆమోదం దక్కింది. ఉభయసభల్లోనూ ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, జేడీఎస్‌లు తీవ్రంగా వ్యతిరేకించి వాకౌట్ చేశారు. అయితే ఉభయసభలలో మెజారిటీ ఉన్నమేరకు బిల్లుకు ఆమోదం దక్కినట్లు అయ్యింది. గ్రేటర్ బెంగళూరు అథారిటీకి శాసనసభలో ఆమోదం లభించిన మేరకు రాజభవన్‌కు పంపి అనుమతులు పొంది ప్రక్రియను వేగవంతం చేయదలచారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కసరత్తు

నగరంలో పెనుసవాల్‌గా మారుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించిన డబుల్‌డెక్కర్, ఎలివేటెడ్ కారిడార్, బెంగళూరు బిజినెస్ కారిడార్, సొరంగ మార్గాలతో పాటు నిర్మాణదశలో ఉండే మెట్రో నిర్మాణాలను మరింత వేగవంతం చేయనున్నారు. పీఆర్ఆర్ పథకం ద్వారా హడ్కో ద్వారా రూ.26వేల కోట్ల రుణం తీసుకుని బెంగళూరు బిజినెస్ కారిడార్ చేపట్టదలచారు.

వంతెనలు.. ఎస్కలేటర్లు..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు శివానంద సర్కిల్‌లో స్టీల్‌బ్రిడ్జ్ నిర్మించాలని నిర్ణయించారు. అయితే దీనిపై తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. సుదీర్ఘకాలం తర్వాత నిర్మాణాలు సాగాయి. ప్రస్తుతం సొరంగమార్గం నిర్మించాలని భావిస్తున్నారు. తూర్పు - పడమరకు 17 కిమీ, దక్షిణ నుంచి ఉత్తరానికి 23 కిలోమీటర్లతో కలిపి 40 కిలోమీటర్ల మేర సొరంగమార్గం నిర్మించనున్నారు. నగరంలో ఇటువంటి ప్రాజెక్టు మొట్టమొదటిది కానుంది. తొలి విడత పనులకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తున్నారు. అతిలోక్ ఇంజనీరింగ్ సంస్థ డీపీఆర్‌ను సిద్ధం చేయగా ప్రభుత్వం అంగీకారం తెలిపింది. జయనగర్ నుంచి జయదేవ ఆసుపత్రి మీదుగా సిల్క్‌బోర్డువైపు డబుల్‌డెక్కర్ బ్రిడ్జి ఇటీవల అందుబాటులోకి వచ్చింది. నేలపైన సాధారణంగా వాహనసంచారం ఉండగా తొలి బ్రిడ్జ్‌లో వాహనాల సంచారం ఉంటుంది. దానిపై భాగంలో మెట్రో సంచారానికి సిద్ధం చేశారు. త్వరలోనే ఇక్కడ మెట్రోసేవలు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా మెట్రో మార్గాలు నిర్మించే ప్రాంతాల్లో 44 కిలోమీటర్ల పొడవున డబుల్ డెక్కర్ బ్రిడ్జ్‌లు ఏర్పాటు చేయదలిచారు. పైభాగంలో మెట్రో, దాని కింద బ్రిడ్జ్‌లో వాహనాల సంచారానికి అనుకూలం చేయదలిచారు. ఈ ప్రాజెక్టులకు బీబీఎంపీ, బీఎంఆర్‌సీఎల్‌లు 50:50నిష్పత్తిన ఖర్చు భరించదలిచాయి. ప్రతి కిలోమీటరుకు రూ.120 కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశారు. దీని ప్రకారం 9వేల కోట్ల రూపాయలు గ్రాంట్లు ఇచ్చారు. సిగ్నల్‌రహిత ఎలివేటెడ్ కారిడార్ రోడ్ల నిర్మాణం చేపట్టదలిచారు. మైసూరు రోడ్డులోని గాలి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద రాజకాలువపై రోడ్డు నిర్మించినరీతిలోనే ఇతర ప్రాంతాలలోనూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టనున్నారు. ఎన్‌జీటీ అనుమతులు దక్కితే రాజకాలువల పక్కన బఫర్‌జోన్ ప్రదేశాలలో 50 అడుగుల మేర 300 కిలోమీటర్ల పొడవు కొత్త రోడ్లు నిర్మించే ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం 3వేల కోట్ల రూపాయలు అవసరంగా గుర్తించారు. ఐటీపీఎల్, థణిసంద్ర, ఆర్‌ఆర్‌నగర్‌తోపాటు పలు ప్రాంతాలలో టీడీఆర్‌ల నుంచి రోడ్లనిర్మాణం చేపట్టదలిచారు. హెబ్బాళ నుంచి హెణ్ణూరు మార్గంలో 7.8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. ఇలా బెంగళూరులో 300 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మించే ఆలోచన ఉంది. 1682 కిలోమీటర్ల రోడ్లను వైట్‌ట్యాపింగ్ చేయనున్నారు. కనీసం 30ఏళ్ల పాటు మన్నిక వస్తాయి. తద్వారా ఏటా వర్షాకాలంలో సమస్యలు తలెత్తవనేది ఆలోచనగా ఉంది. ఇక 850 కిలోమీటర్ల మేర వర్షపునీటి పనులకు ప్రపంచబ్యాంకు నుంచి రూ.2వేల కోట్లు రుణం తీసుకోనున్నారు. బెంగళూరు రూపురేఖలు మార్చేందుకు పలు ప్రాజెక్టులు సిద్ధం చేస్తున్నారు.

బ్రాండ్ బెంగళూరు లోగో




డబుల్ డెక్కర్ బ్రిడ్జ్

వైభవంగా దొడ్డబసవేశ్వరుడి రథోత్సవం



కంప్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక ప్రాంతంలోనే ప్రసిద్ధి చెందిన కురుగోడు దొడ్డబసవేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ ప్రాంతంలో అత్యంత ప్రాచీన కాలం నుంచి జరిగే దొడ్డబసవేశ్వర రథోత్సవానికి చాలా విశిష్టత ఉంది. ఈ ఉత్సవాలకు కురుగోడు ప్రాంతం ప్రజలే కాకుండా జిల్లాలోని నలమూల నుంచి అలాగే ఇతర రాష్ట్రాల నుంచి విశేషంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జాతర సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి విశేష పూజలు జరిపారు. రైతులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్ల, ఇతర వాహనాల్లో వేలాది మంది భక్తుల తరలివచ్చి దొడ్డబసవేశ్వరుడిని దర్శించుకున్నారు. అంతకముందు భక్తులకు పానీయాలు, అల్పాహార ప్రసాదం, భోజన సౌకర్యాలను దాతలు నిర్వహించారు. ఎమ్మెల్యే గణేశ్ రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. ఆయనతో పాటు రైతులు, పలు గ్రామాల ప్రజలు, తదితరలు పెద్ద ఎత్తున కదలి వచ్చి స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.



అశేషంగా విచ్చేసిన భక్తుల మధ్య సాగుతున్న రథం, అలంకరణలో దొడ్డ బసవేశ్వరుడు

సంబరాల హోలీ...

- రాష్ట్రమంతటా హోలీ సందడి
- రంగులు చల్లుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు





సంబరాల్లో యువత



బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా హోలి సందడి సాగింది. బెంగళూరు, బెళగావి, బాగల్కోటె, మంగళూరు, ఉడుపి నగరాలలో శుక్రవారం ఉదయం నుంచి ఎటుచూసినా రంగులు చల్లుకుంటూ యువత కేరింతలు కొట్టారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు చెప్పుకొనే సంప్రదాయం ఉంది. బెంగళూరులో పలు విద్యాసంస్థల ప్రాంగణాలలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని అవెన్యూ రోడ్డు, బీవీకే అయ్యంగార్ రోడ్డు, చామరాజపేట, జయనగర్, ఇందిరానగర్ ప్రాంతాలలో వేలాదిమంది వేడుకలలో పాల్గొన్నారు. పలు హోటళ్లు, రిసార్టులు హోలికోసం ప్రత్యేక ప్యాకేజీలతో ఆకట్టుకున్నారు.





నగరంలోని పలు ప్రాంతాల్లో హోలీ సంబరాలు చేసుకుంటున్న జనం



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

6

గరుడ వాహన విహారి

'ఈ-పాలన'లో రాష్ట్రానికి కేంద్రం అవార్డు

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈ-పాలన వ్యవహారాలలో ఉత్తమమైన సేవలు కొనసాగిస్తున్నందుకు 2024 సంవత్సరానికిగాను జాతీయ ఈ-పాలనా పురస్కారం రాష్ట్రప్రభుత్వానికి దక్కింది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఈ-గవర్నెన్స్ అవార్డును ప్రకటించింది. ఈమేరకు సీఎం సిద్దరామయ్య శుక్రవారం 'ఎక్స్' ద్వారా హర్షం వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రభుత్వం దూరదృష్టితో ఈ-పాలనా వ్యవహారాలు సమగ్రంగా నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రానికి జాతీయస్థాయిలో బంగారు బహుమతి దక్కడం సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక పారదర్శక, ప్రజాస్నేహి పాలనతో దేశానికే మార్గదర్శక రాష్ట్రమన్నారు. పురస్కారం ప్రజాసేవా కార్యక్రమాలకు మా ఉత్సాహం మరింత పెంపొందించినట్లు అయ్యిందన్నారు. ఈ-పాలనా విధానాలను అమలు చేసేలా ఉత్తేజపరిచేందుకు కేంద్రప్రభుత్వం పాలనా సంస్కరణలు, ప్రజాసంబంధాల విభాగం ఏటా జాతీయస్థాయిలో పురస్కారాన్ని ప్రకటిస్తుంది.

ప్రభుత్వానికి కేఐఓసీఎల్ రూ.3వేల కోట్ల బకాయి

- నిబంధనలు పాటిస్తే గనుల తవ్వకాలకు అవకాశం
- అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఖుద్రేముఖ్ ఐరన్‌ఓర్ కంపెనీ లిమిటెడ్ (కేఐఓసీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి 3వేల కోట్ల రూపాయలు బకాయి ఉందని అటవీశాఖమంత్రి ఈశ్వర్‌ఖండ్రె అభిప్రాయపడ్డారు. శుక్రవారం శాసనసభలో బీజేపీ సభ్యుడు భరత్‌శెట్టి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. గతంలో కేఐఓసీఎల్ రాష్ట్రంలో గనులు తవ్వకాలు కొనసాగిస్తున్న వేళ పలు నిబంధనలు ఉల్లంఘించిందన్నారు. అందుకు నోటీసులు జారీ చేశామన్నారు. లక్యా ఆనకట్ట ఎత్తు పెంచి 340 హెక్టార్ల అటవీప్రాంతానికి భంగం కలిగించిందన్నారు. కుదురెముఖ్ జాతీయ ఉద్యానవనానికి వెళ్లే రోడ్ల ఏర్పాటుతోపాటు 465.73 హెక్టార్ల ప్రదేశాన్ని అనుమతులు లేకుండానే అటవీయేతర ఉద్దేశ్యాలకు ఉపయోగించుకున్నారన్నారు. పర్యావరణ నష్టానికి రూ.142 కోట్లు చెల్లించాల్సి ఉందని, వీటితోపాటు ఎన్‌పీవీ ట్యాక్స్ రూ.628 కోట్లుగా ఉందని వడ్డీతోపాటు అన్ని కలిపితే రూ.3వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేఐఓసీఎల్ చెల్లించాల్సి ఉందన్నారు. కుదురెముఖ్ నిబంధనలు సంపూర్ణంగా పాటిస్తే సండూరు, దేవదరిలో గనులకు అనుమతులు ఇస్తామని మంత్రి తెలిపారు. 2022 డిసెంబరు 16న ఉన్నతాధికారుల కమిటీ సిఫారసులు, సూచనలు పాటించాలని నిబంధనలు పెట్టిందన్నారు. అన్ని షరతులకు లోబడి దేవదరిలో గనులకు అనుమతులు ఇచ్చామన్నారు. దక్షిణకన్నడ జిల్లాలో వెయ్యిమందికిపైగా కార్మికులు పనిచేసే దేవదరి ఐరన్‌ఓర్ మైన్స్, సండూరులో గనుల తవ్వకాలకు సంబంధించి అనుమతులు ఇవ్వకపోవడంపై సభ్యుడు భరత్‌శెట్టి ప్రస్తావించారు. ఇక్కడ కార్మికులకు తీవ్రమైన సమస్య ఉందని సభ్యుడు వివరించారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

గ్రాంట్లపై అట్టుడికిన పరిషత్

ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లు గ్యారెంటీలకు ఉపయోగించారనే అంశంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో సభాపతి బసవరాజహొరట్టి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గ్రాంట్లు గ్యారెంటీ పథకాలకు ఎలా ఉపయోగిస్తారని జేడీఎస్ సభ్యుడు శరవణ ప్రశ్నించారు. సబ్‌ప్లాన్ ప్రకారం ఇతరత్రా పథకాలకు ఉపయోగించేందుకు వీలు లేదనే నిబంధనలు ప్రభుత్వం పాటించడం లేదన్నారు. ఇదే విషయమై ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి జోక్యం చేసుకుని దళితులకు ప్రభుత్వం ద్వారా పలు విధాలా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. సమాజానికి మోసం చేసేందుకు మా వర్గానికి చెందిన వ్యక్తినే ఉంచారని, ఇది మోసం కాదా... అంటూ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లు వాపసు ఇవ్వాలని, గ్యారెంటీలతో మార్పు తీసుకొస్తామని ఇలాంటి మోసం చేస్తారా..? అని ప్రశ్నించారు. ఇదే సందర్భంలోనే కాంగ్రెస్ సభ్యుడు నజీర్ అహ్మద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రం కావడం సభ్యులంతా లేచి నిలబడి నినాదాలు చేయడంతో సభాపతి హొరట్టి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మరోసారి ఇదే తరహాలో వ్యవహరిస్తే బయటకు పంపుతామని హెచ్చరించారు.

నందవరీక్ మహాసభ ఆధ్వర్యంలో 23న చండికాహోమం



చౌడేశ్వరీ దేవి

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నందవరీక్ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 23న చండికా హోమం, చౌడేశ్వరీదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బీఎం భానుమూర్తి వెల్లడించారు. బెంగళూరు చామరాజపేట శృంగేరి శంకరమఠం ఆవరణంలో జగద్గురువులు భారతీతీర్థ స్వామీజీ, విధుశేఖర భారతీతీర్థ స్వామీజీల అనుగ్రహంతో లోకకళ్యాణార్థం హోమం జరుపుతున్నామన్నారు. వేదబ్రహ్మ కేఎస్ గణేష్‌సోమయాజీ పర్యవేక్షణలో వేదపండితులు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23న ఆదివారం ఉదయం గురుప్రార్థన, గణపతి పూజ, కుంకుమార్చన, చండికా పారాయణ, చండికా హోమం ఉంటుందని, మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతి, మహామంగళారతి జరుగుతుందన్నారు. చండికా హోమం, కుంకుమార్చనలో పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



రంజాన్ వేళలు	
ఇఫ్తార్	సెహరీ
6.46	5.15
శనివారం సాయంత్రం	ఆదివారం ఉదయం



సభ వద్ద నాగాబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనసేన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పవన్ అభిమానం


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

జనసైనికా.. కూల్..కూల్..

పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

వైసీపీలో అలజడి.!

● రాయదుర్గంలో నలుగురు కౌన్సిలర్లు, ఇద్దరు నాయకుల సస్పెన్షన్

రాయదుర్గం, మార్చి14(ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఒక్కసారిగా అలజడి రేగింది. పట్టణానికి చెందిన నలుగురు కౌన్సిలర్లతోపాటు ఇద్దరు సీనియర్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దుమారం రేపింది. రాయదుర్గం వైసీపీలో ఇటీవల అసమ్మతి బ లపడుతూ వస్తోంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వేదికగా రెం డువర్గాలుగా విడిపోయి, తన్నుకునే స్థాయికి చేరారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన అధిష్టానం సస్పెన్షన్‌తో క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. మరికొందరిని త్వరలోనే సస్పెండ్ చేయనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మెన్ శ్రీనివాసులుయాదవ్, వలి, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేశారు. డీ.హీరేహాళ్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామి, రాళ్ల తిమ్మారెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. శాసనసభ ఎన్నికల అనంతరం నివురుగప్పిన నిప్పు లా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమంది. నాలుగేళ్లపాటు మున్సిపల్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పొరాళ్ల శిల్పను గద్దె దింపడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. దీని కోసం నాలుగు నెలలుగా తీవ్ర కసరత్తు సాగుతోంది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేస్తూ వస్తున్నారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో 14 మంది సభ్యులు జట్టుగా ఏర్పడి కోరం లేకుండా చేసి చైర్‌పర్సన్‌ను గద్దె దింపే ప్రయత్నానికి పూనుకున్నారు. రెండు వర్గాలుగా ఏర్పడి వాగ్వాదం చేసుకోవడంతోపాటు తన్నుకునే స్థాయికి చేరా రు. దీంతో వైసీపీ అధిష్టానం సస్పెండ్ చేసింది. మున్సిపల్ కౌన్సిల్‌లో 32 మంది సభ్యుల్లో 29 మంది వైసీపీకి చెందిన వారున్నా రు. వీరిలో 14 మందిదాకా తిరుగుబాటు చేస్తున్నారు. అధిష్టానం బుజ్జగించే చర్యలు చేపట్టినా వారు వెనక్కి తగ్గలేదు. పైగా ము న్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న శిల్పను గద్దె దింపడానికి వైస్ చైర్మన్ వలి.. కొందరికి సొమ్ము చెల్లించి, తన వైపు తిప్పుకుంటున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రెండు వర్గాలుగా ఏర్పడి, ఎవరికి వారు ఎత్తుగడలు వేస్తున్నారు. డీ.హీరేహాళ్ మం డల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామితోపాటు సీనియర్ నాయకుడు రాళ్ల తిమ్మారెడ్డి.. బీజేపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారంటూ చర్యలు తీసుకుంది. అసమ్మతి వర్గం.. వైసీ పీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకి స్తూ వస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సస్పెన్షన్ ఎలాంటి పరిణామాలకు తావిస్తుందోనన్న చర్చలు వినిపిస్తున్నాయి.

రాజీనామాకు సిద్ధంగా 8 మంది కౌన్సిలర్లు

తమపై చర్యలు తీసుకోవడంతో వైసీపీకి తీవ్ర నష్టం తప్పదని బహిష్కృత కౌన్సిలర్లు తెలిపారు. వైస్ చైర్మెన్ వలి, శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, శ్రీనివాసరెడ్డి, వన్నూరుస్వామి విలేకరులతో మాట్లాడారు. మరికొందరు కౌన్సిలర్లు, నాయకులు కూడా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. సస్పెన్షన్లతో పార్టీకి మరింత నష్టం తప్పదన్నారు. ఇంకా ఎనిమిది మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. రాజీనామాకు సంబంధించి సంతకాలు చేసిన లేఖను చూపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మార్చాలని 14 మంది కౌన్సిలర్లు.. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని పలుమార్లు కోరామన్నారు. ప్రయోజనం లేదన్నారు. మెట్టు గోవిందరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపడం ఖాయమనీ, అవిశ్వాసం పెట్టి తీరుతామని వారు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న బహిష్కృత కౌన్సిలర్లు, నాయకులు

సంచార పశువైద్యం బంద్..!

అనంతపురం అర్బన్/విడపనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచార పశు వైద్య సేవలు నిలిచిపోయాయి. 2022 సంవత్సరంలో తొలి విడత కింద జిల్లా వ్యాప్తంగా ఏడు పశు సంచార వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోని పశువుల ఆసుపత్రుల్లో ఆయా వాహనాలను ఉంచి, వచ్చిన కాల్ ఆధారంగా సేవలు అందిస్తూ వస్తున్నారు. అప్పట్లో జీవీకే సంస్థకు సంచార వాహనాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఆ సంస్థతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం పూర్తయింది. దీంతో తొలి విడతలో మొదలు పెట్టిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. సంచార వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వాహనాలను అర్ధంతరంగా నిలిపేశారు. యథావిధిగా విధులకు వెళ్లిన వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. వాహనాలను నిలిపివేశామని, ఇక నుంచి విధులకు హాజరుకావాల్సిన అవసరం లేదని అక్కడి అధికారులు చెప్పారు.

తొలి విడతలో 7 వాహనాల నిలిపివేత
డాక్టర్లు, సిబ్బందికి సమాచారమే ఇవ్వని వైనం
కాంట్రాక్టు ముగియడంతో నిలిపివేశామంటున్న యంత్రాంగం
ఆయా ప్రాంతాలకు నిలిచిన సేవలు
రైతులు, పశువుల కాపర్లకు తిప్పలు



పశు సంచార వాహనం

సగం మండలాలకు నిలిచిన సేవలు

అనంతపురం అర్బన్, శింగనమల, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ కేంద్రాల్లో 2022 సంవత్సరంలో తొలి విడతలో పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ 1962కు రైతులు ఫోన్ చేసిన ప్రాంతాలకు సంచార వాహనంలో వెళ్లి పశువులు, మూగజీవాలకు వైద్యం అందిస్తున్నారు.

రెండో విడతలో 2023 ఫిబ్రవరి నుంచి అనంతపురం రూరల్, పుట్లూరు, యాడికి, గుత్తి, కూడేరు, శెట్టూరు, కణేకల్లు మండల కేంద్రాల్లో మరో ఏడు పశు సంచార వాహనాలను ఏర్పాటు చేశా రు. ఫోన్ కాల్స్ ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి తొలి విడతకు చెందిన పశు సంచార వాహనాలను నిలిపివేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సగం మండలాల్లోని పశువులు, మూగజీవాలకు సంచార సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. తిరిగి ఆయా ప్రాంతాలకు పశు సంచార వాహనాలను ఎప్పుడు పంపుతారో తెలియని అయోమయం ఏర్పడింది.



పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది (ఫైల్)

వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది ఆందోళన

పశు సంచార వాహనాల ద్వారా వైద్య సేవలు అందించేందుకు వెటర్నరీ డాక్టర్లు, అసిస్టెంట్లు, డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఒక్కో వాహనంలో ఒక వెటర్నరీ డాక్టర్, పారావెట్ (వెటర్నరీ అసిస్టెంట్), పైలెట్ (డ్రైవర్) పనిచేస్తున్నారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న జీవీకే సంస్థ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉన్నట్లుండి వాహనాలు నిలిపివేయడంతో తాము రోడ్డుమీద పడ్డామని వారు ఆవేదన చెందుతున్నారు. సంచార వాహనాలు తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారు..? తమను ఉద్యోగంలోకి తీసుకుంటారా..? లేదా అనే కనీస సమాచారం కూడా ఎవరూ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం ఎదుట బాధిత వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.

సంచార సేవలను ప్రారంభించాలి



నాకు కాడెద్దులు, ఆవు, ఎనుము ఉన్నాయి. గతంలో సంచార పశు వాహనం ఊళ్లోకి వచ్చేది. ఫోన్ చేస్తే వచ్చి పశువులకు చికిత్స అందించే వారు. పశువులు నడవలేని స్థితిలో ఉన్నప్పుడు సంచార వాహన సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. మూడు వారాలుగా సంచార వాహనం రాలేదు. సంచార వాహనాన్ని తిరిగి ఏర్పాటు చేసి, పశువులకు వైద్య సేవలు అందించాలి.

-గంగన్న, రైతు, విడపనకల్లు

జీవాలకు చికిత్స చేసేవారు



గొర్రెలు, మేకలను సాకుతూ జీవనం సాగిస్తున్నా. అత్యవసరంగా గొర్రెలు, మేకలకు చికిత్స అవసరమైతే సంచార వాహనం నెంబర్ 1962కు ఫోన్ చేస్తే నేరుగా వాహనంలో డాక్టర్, సిబ్బంది వచ్చేవారు. జీవాలకు అవసరమైన చికిత్సలు చేసేవాళ్లు. ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు ఏదైనా జీవాలకు చికిత్స చేయించాలంటే పశువుల ఆసుపత్రికే తీసుకువెళ్లాలి. సంచార వాహనాన్ని కొనసాగించాలి.

-రామాంజనేయులు, విడపనకల్లు

కాంట్రాక్టు పూర్తి కావడంతో ఆపేశారు

కాంట్రాక్టు కాలం పూర్తి కావడంతో తొలి విడతకు చెందిన సంచార పశుసేవా వాహనాలను నిలిపివేశారు. ఆయా వాహనాల్లో పనిచేస్తున్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది తిరిగి వాహనాలను ఏర్పాటు చేసి, తమకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతిపత్రం అందించారు. రైతుల నుంచి కూడా సంచార వాహనాలను పంపాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

-వెంకటస్వామి, జేడీ, పశుసంవర్ధక శాఖ

గరుడ వాహన విహారి

● అలరించిన ఖాద్రీశుడి వేడుక ● నేడు శ్రీదేవి భూదేవి సమేతుడై.. శేష వాహనంపై విహారం

కదిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధా న్యం ఉన్న బ్రహ్మగరుడ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. యాగశాలలో శ్రీవారికి ఉదయం నిత్యపూజ నిర్వహించి, తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం గరుడ వాహనంపై తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు వేదపండితులు గరుడ పూజను నిర్వహించారు. గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారిని తూర్పు రాజ గోపురం నుంచి దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం, తిరు వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీవారికి ఊరేగింపు ముందు జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాలలో శనివారం శేష వాహన సేవ నిర్వహిస్తారు. అన్ని వాహన సేవల్లో శ్రీవారు మాత్రమే తిరువీధులలో భక్తులకు దర్శనమిస్తారు. కానీ శేష వాహన సేవలో శ్రీదేవి, భూదేవి సమేతుడై స్వామివారు తిరువీధుల్లో విహరిస్తారు.



బ్రహ్మగరుడ సేవలో స్వామివారు...

కదిరి పున్నమి

కదిరి పున్నమిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏపీ, కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి మొక్కులను తీర్చుకున్నారు.

నేడు కదిరికి కొక్కంటి జ్యోతి

తనకల్లు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా కొక్కంటి పాలేగాళ్ల ఆధ్వర్యంలో నిర్వహించే కొక్కంటి జ్యోతి కార్యక్రమం శనివారం తెల్లవారుజామున మొదలవుతుంది. కదిరికి సాయంత్రంలోపు చేరుకుంటుందని కొక్కంటి పాలేగాడు వైవీ దినకర్‌నాయుడు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు. కొక్కంటి పాలేగాళ్ల ఇంటిలో జ్యోతికి శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి క్షేత్రం మీదుగా కదిరికి చేరుకుంటుంది. తనకల్లు, నల్లచెరువు, అన్నమయ్య జిల్లా ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లి మండలాల భక్తులు కాలినడకన కదిరి బ్రహోత్సవాలకు వెళ్లి, జ్యోతి కార్యక్రమంలో పాల్గొంటారు.



కొక్కంటి జ్యోతి (ఫైల్)

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయిన్...

మునిమాణిక్యం నరసింహారావు (జయంతి)



హాస్య రచయితగా గుర్తింపు పొందిన మునిమాణిక్యం నరసింహారావు 1898 మార్చి 15న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించారు. 21వ శతాబ్దం తొలినాళ్లలో కథకుడిగా రూపుదిద్దుకున్నారు. కుటుంబ జీవితంలోని కష్టసుఖాలు, దాంపత్య జీవితంలోని సౌందర్యం ఈయన కథలలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. భార్య ప్రేరణతో ఆయన రచించిన 'కాంతం కథలు' తెలుగు కథాసాహిత్యంలో ఒక మణిపూస. ఆయన కుమారుడు రఘునాథ యాజ్ఞవల్క్య కూడా రచయితగా రాణించారు. నరసింహా రావు హాస్య రచయిత మాత్రమే కాదు హాస్యపోషకులు కూడా. 1973 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

జూలియస్ సీజర్ (వర్ధంతి)



రోమన్ మిలిటరీ అధికారి, రాజకీయనేతగానే కాకుండా ల్యాటిన్ గద్యంలో ప్రముఖ రచయితగా రాణించిన గయస్ జూలియస్ సీజర్ (క్రైజర్) క్రీస్తుపూర్వం 100 జూలై 12న జన్మించారు. రోమన్ రిపబ్లిక్‌ను రోమన్ సామ్రాజ్యంగా విస్తరింప చేయడంలో కీలకంగా వ్యవహరించారు. పాలనలో సంస్కరణలు తెచ్చి తనదైన ముద్రను చాటారు. క్రీస్తుపూర్వం 44 మార్చి 15న ప్రత్యర్థుల చేతిలో హతమయ్యారు.

జిన్సన్ జాన్సన్ (పుట్టినరోజు)



అథ్లెటిక్స్‌లో అర్జున పురస్కార గ్రహీత, 'నాయిబ్ సుబేదార్' హోదాలో కొనసాగుతున్న జిన్సన్ జాన్సన్ 1991 మార్చి 15న కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాలో జన్మించారు. ఇండియన్ ఆర్మీలో 2009 నుంచి జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ)గా వ్యవహరిస్తున్నారు. 800, 1500 మీటర్ల పరుగు పందెంలో మిడిల్ డిస్టన్స్ రన్నర్‌గా రాణించారు. 2016 సమ్మర్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో 1500మీటర్ల విభాగంలో జాతీయ రికార్డు నెలకొల్పారు. 2018 ఏషియన్‌గేమ్స్‌లో 1500మీటర్ల పురుషుల విభాగంలో బంగారుపతకం, 800 మీటర్ల విభాగంలో రజతపతకం సాధించారు.

అలియాభట్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన ప్రముఖ నటి అలియాభట్ 1993 మార్చి 15న ముంబైలో జన్మించారు. సినిమా దర్శకుడు మహేశ్‌భట్, నటి సోని రజ్దాన్‌ల కుమార్తె. బాలనటిగా 1999లో హిందీ సినిమా 'సంఘర్ష్'తో తెరంగేట్రం చేశారు. అనంతరం 2012లో 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమాతో హీరోయిన్‌గా గుర్తింపు పొందారు. కొన్ని పాటలు కూడా పాడారు. 2019 నాటికి అత్యధిక రెమ్యూనరేషన్ నటీమణులలో ఒకరిగా నిలిచారు. 4 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు పొందారు. పలు రకాల ఉత్పత్తులకు, బ్రాండ్‌లకు రాయబారిగా వ్యవహరిస్తున్నారు. 2024లో ప్రపంచంలో వందమంది ప్రభావ వ్యక్తులలో ఒకరిగా నిలిచారు.

వైభవంగా అమరనారేయణస్వామి బ్రహ్మరథోత్సవం

- ఇస్కాన్‌లో గౌరపూర్ణిమ వేడుకలు
- పౌర్ణమికి పలు చోట్ల రథోత్సవాలు



రామగొండనహళ్ళిలో రథోత్సవం



కైవార అమరనారేయణస్వామి రథోత్సవంలో భక్తులు



అగర పురవీధుల్లో రథోత్సవం

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఫాల్గుణమాస పౌర్ణమి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వివిధ దేవతలకు రథోత్సవాలు సాగాయి. నగరంలోని ఇస్కాన్ మందిరంలో గౌర పూర్ణిమగా శుక్రవారం వేడుకలు నిర్వహించారు. చైతన్య మహాప్రభు ఆవిర్భవించిన రోజుగా పరిగణిస్తారు. 500ఏళ్లక్రితం శ్రీచైతన్య మహాప్రభు అవతరించి దేశవ్యాప్తంగా హరినామ సంకీర్తనతో ప్రజలలో చైతన్యం కల్పించారు. భగవన్నామ ప్రాధాన్యతను వివరించారు. నగరంలోని రాజాజినగర్ ఇస్కాన్ మందిరంలో నితాయ్ గౌరంగ్ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. కృష్ణభక్తిని చాటిన గురువులకు విశేషంగా వందనం సమర్పించే కార్యక్రమాలు కొనసాగాయి. ఇస్కాన్ సహా పలు ఆలయాలలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది.

కైవారలో అమర నారేయణస్వామి..

చింతామణి: తాలూకాలోని పురాణ ప్రసిద్ధ కైవార అమర నారేయణస్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఫాల్గుణ పున్నమిని పురస్కరించుకుని ఏటా స్వామివారికి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సద్గురు తాతయ్య మఠం నుంచి శ్రీకృష్ణ గంధోత్సవ విశేషసేవలో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణమధ్య రథోత్సవం కనులపండువగా జరిగింది. తేరుపై అరటిపండు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కాగా ఆలంబగిరిపై గిరి ప్రదక్షిణలోనూ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దొమ్మసంద్రలో కాశీ విశ్వనాథేశ్వరస్వామి..

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకాలోని దొమ్మసంద్రలో కాశీ విశ్వనాథేశ్వరస్వామి, మహాగణపతి సుబ్రమణ్యస్వామిల బ్రహ్మరథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తొలుత గిరిజా సమేత కాశీవిశ్వనాథేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు విశేషపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. కాశీవిశ్వనాథేశ్వరస్వామి రథం, వినాయక, సుబ్రమణ్యస్వామి జోడి రథాలు పురవీధులలో సాగాయి. రెండు రథాలను వీక్షించేందుకు భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని రథోత్సవానికి మరింత మెరుగు తెచ్చారు. డొళ్ళు కుణిత, వీరగాసె, గారడీ బొమ్మలు, వివిధ జానపద కళాకారుల బృందాలు పాల్గొన్నాయి. రథోత్సవంలో భాగంగా కాశీయాత్ర, గిరిజాకల్యాణం, నందివాహ నోత్సవం, ధూళోత్సవం, ఉయ్యాలోత్సవం కార్యక్రమాలు సాగాయి. కాగా ముత్యాలమ్మదేవి కరగ మహోత్సవం, గ్రామ దేవతల పల్లకీ ఉత్సవంలో పెద్దసంఖ్యలో మహిళలు, చుట్టుపక్కల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరాయస్వామి బ్రహ్మరథోత్సవం

మహదేవపుర: నియోజకవర్గ పరిధిలోని వైట్‌ఫీల్డ్ రామగొండనహళ్ళిలో తిరుమలరాయస్వామి బ్రహ్మ రథోత్సవం, ద్రౌపదిదేవి కరగ మహోత్సవం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ద్రౌపదీదేవి జయంతి ఉత్సవంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తిగళ సామాజిక వర్గీయులు కరగ ఉత్సవాన్ని ఆచరించడం ఆచారంగా వస్తోంది. కళశాలను నెత్తిపై పెట్టుకు మహిళలు గ్రామమంతటా ఊరేగించి రాష్ట్రాభివృద్ధికోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ ఏటా తిరుమలరాయస్వామి బ్రహ్మ రథోత్సవానికి విచ్చేసే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. శతాబ్దాలకాలంగా ఆచరిస్తున్న కార్యక్రమాలను పూర్వీకులు చూపిన బాటలోనే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రామగొండనహళ్ళి, వైట్‌ఫీల్డ్, వర్తూరు, హగదూరు, సిద్దాపుర తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలలో బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎల్ రాజేశ్, రాజారెడ్డి, వర్తూరు శ్రీధర్, మహేంద్రమోది, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగరలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి..

బొమ్మనహళ్ళి: నియోజకవర్గంలోని అగర ప్రాంతంలో ప్రముఖమైన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ ఉత్సవాలలో భాగంగా ఫాల్గుణమాసం పౌర్ణమి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 7న ప్రారంభమైన ఉత్సవాలలో శేషవాహనం, గరుడోత్సవం, శయనోత్సవం, మహాభిషేకం, హంసవాహనంపై స్వామివారు ఊరేగించారు. బుధవారం శ్రీవారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. శుక్రవారం విశేషపూజల అనంతరం ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చారు. అగర పురవీధులలో రథోత్సవం సాగింది. సాయంత్రం యథాస్థానానికి రథం చేరుకుంది. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అగర గ్రామస్థుల సహకారంతో ఆలయ ధర్మకర్తలు పటేల్ కృష్ణారెడ్డి, ఏవీ శ్రీనివాసరెడ్డి, ఆలయ చారిటబుల్ ట్రస్టు పదాధికారులు ఉత్సవాలను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకుడు చంద్రమౌళి మాట్లాడుతూ ఆలయానికి పురాణ ప్రాశస్త్యం ఉండడంతో ఏటా భక్తుల రాక పెరుగుతోందన్నారు. కేరళ డ్రమ్స్, ఇతర కళాకారులు రథోత్సవంలో సందడి చేశారు. రథోత్సవం సందర్భంగా భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. అన్న సంతర్పణ కూడా సాగింది. ఈనెల 20వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. బొమ్మనహళ్ళి, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, అగర, సోమసుందరపాళ్య తదితర ప్రాంతాలను భక్తులు తరలివచ్చారు. మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి, తదితర ప్రముఖులు రథోత్సవంలో పాల్గొన్నారు.




దొమ్మసంద్ర పురవీధుల్లో రథోత్సవం



అగరలో శ్రీవారికి విశేష అలంకరణ



గంధోత్సవ సేవలో కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు



ఇస్కాన్‌లో విశేష పూజలు

మాదకద్రవ్యాల స్వాధీనం

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సీసీబీ పోలీసులు నిర్వహించిన కార్యాచరణలో రూ.55.50 లక్షల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. దాడులలో 55.20 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్, 1 కిలో 905 గ్రాముల గంజాయితో పాటు దుష్పరిణాల ప్రభావం సూచన లేని పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషన్ దయానంద్ తెలిపారు. కలాసిపాళ్య పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడౌన్‌పై దాడులలో రూ.45లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారన్నారు. మరో దాడిలో ఒక వ్యక్తి నుంచి ఎండీఎంఏ క్రిస్టల్, గంజాయితోపాటు వీటిని తరలించేందుకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటి విలువ రూ.10.50లక్షలుగా ఉందన్నారు. వస్తువులను, నిందితుడిని చన్నమ్మకెరె అచ్చుకట్టు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

కిడ్నీ సమస్యలకు ఉచిత పరీక్షలు

మహదేవపుర, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో కిడ్నీ సమస్యలు అధికమయ్యాయని వీటికి చికిత్సలు సైతం ఖర్చుతో కూడియుందని ఈ నేపథ్యంలో ప్రతి ఆరు నెలలు లేదా ఏడాదికోసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని మెడికవర్ ఆసుపత్రి యూనిట్ హెడ్ జీ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. వైట్‌ఫీల్డ్ సమీపంలోని మెడికవర్ ఆసుపత్రిలో వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకుని ఉచిత కిడ్నీ పరీక్షలను ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహార పద్ధతుల కారణంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పౌష్టికాహార కొరత, ధూమపానం, మద్యపానం, అధిక బరువు వంటివి కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతున్నాయన్నారు. సమస్యలను ప్రారంభంలోనే గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. ఈనెలాఖరు వరకు ఉచితంగా కిడ్నీ పరీక్షలు చేస్తున్నామని నెఫ్రోలజిస్ట్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. మీడియా సమావేశంలో డాక్టర్ శృతికోయ్లి, రోబోటిక్ శస్త్రనిపుణుడు శివరామ్‌భట్, ప్రమోద్ పాల్గొన్నారు.

చేమంతి పంటకు నష్టం

శిడ్లఘట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని శెట్టిహళ్ళి గ్రామానికి చెందిన మంజునాథ్ తోటలో చేమంతి పూలతోటకు క్రిమిసంహారక మందు పిచికారి చేశాక వాడిపోయింది. దిగుబడి దశలో ఉన్న పంట ఒక్కసారిగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. సుమారు 25 కుంటలలో చేమంతి పంట సాగు చేస్తున్నాడు. పంటనష్టంపై రైతు ఫిర్యాదు మేరకు ఉద్యానవనాలశాఖ, విజిలెన్స్ అధికారులు స్పందించారు. శుక్రవారం పంటను పరిశీలించారు. సమగ్ర దర్యాప్తు చేశాక తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు.



దెబ్బతిన్న పంట వద్ద రైతు

సర్జాపుర పట్టు రైతుల సహకార సంఘానికి పదాధికారులు

దొమ్మసంద్ర, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర పట్టు పెంపకందారులు, రైతు సేవా సహకారసంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, డైరెక్టర్‌లను ఆత్మీయంగా సత్కరించారు. సంఘానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో 12 మంది డైరెక్టర్‌ల స్థానాలకు గాను అందరూ బీజేపీ మద్దతుదారులు గెలుపొందడంపై బీజేపీ ఆధ్వర్యంలో పదాధికారులను సన్మానించారు. సంఘం డైరెక్టర్‌లుగా ఎస్‌వీ శ్వేత రాఘవేంద్ర, జీ సుధా, ఆశా కిరణ్, హరీశ్‌బాబు, పిల్లారెడ్డి, భ్రమరేశ్, సుబ్బారెడ్డి, పవన్‌కుమార్, వెంకటేశ్ తదితరులు విజయం సాధించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి ఏ నారాయణస్వామి, ఎమ్మెల్యేలు సీకే రామమూర్తి, సతీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోపినాథరెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొని అభినందించారు.



సంఘం పదాధికారులకు సన్మానం

పొరుగింటివారితో గొడవ... హతమార్చేందుకు కుట్ర

- కారుతో ఢీ కొట్టే యత్నంలో మహిళకు గాయాలు - మంగళూరులో ఘటన



సీసీటీవీ ఫుటేజీ

బెంగళూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పొరుగింటివారితో గొడవ తారస్థాయికి చేరి ఏకంగా హతమార్చేందుకు కుట్ర జరిగిన సంఘటన మంగళూరు నగరం బిజైకాపికాడ్‌లో గురువారం ఉదయం చోటు చేసుకుంది. సతీశ్‌కుమార్, మురళిప్రసాద్ ఒకేప్రాంతంలో నివసించేవారు. ఇద్దరిమధ్య గొడవలు కొనసాగుతున్నాయి. మురళిని హతమార్చేందుకు సతీశ్ ప్రయత్నించాడు. మురళి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారుతో ఢీ కొట్టాలని కుట్ర పన్నాడు. పథకం ప్రకారం మురళి బైక్‌పై వెళ్తున్న సమయాన్ని గుర్తించి సతీశ్‌కుమార్ కారులో వెంబడించాడు. మురళితోపాటు అదే మార్గంలో నడిచి వెళ్తున్న మహిళను కారుతో ఢీ కొట్టాడు. కారు వేగంగా దూసుకురావడంతో ఆమె ఏకంగా ప్రహరీగోడ ఎత్తుమేర ఎగిరి గ్రిల్‌కు వేలాడారు. క్షణాల వ్యవధిలో అక్కడికి చేరుకున్న స్థానికులు ఆమెను రక్షించారు. బాధిత మహిళతోపాటు మురళిలను సమీప ఆసుపత్రిలో చేర్చారు. సమీపంలోని ఓ ఇంటికి అమర్చిన సీసీ కెమెరా ద్వారా ఈ దృశ్యాలు రికార్డు అయ్యాయి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి మహిళను ఢీ కొన్న ఘటనపై మంగళూరు ట్రాఫిక్ వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సతీశ్‌కుమార్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. స్థానికంగా ఈ ఘటన కలకలం కలిగించింది.

తాగునీటి కోసం గ్రామస్థుల నిరసన



ఖాళీబిందెలతో గ్రామస్థుల నిరసన ఇలా...

శిడ్లఘట్ట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామంలో తాగునీటికి సమస్య తలెత్తడంతో ఖాళీ బిందెలతో గ్రామస్థులు నిరసన తెలిపారు. గ్రామపంచాయతీ సభ్యురాలు నేత్రావతి మాట్లాడుతూ జలజీవన్‌మిషన్ పథకం కాంట్రాక్టర్ దేవరాజ్ నీటి పంపిణీలో తారతమ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు అనుకూలమైనవారికి మాత్రమే నీరు విడుదల చేస్తున్నారని, మిగిలినవారిని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కాగా గ్రామంలో నీటిపైప్‌లు, కొళాయిలు నాసిరకంగా ఉన్నాయన్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందిస్తూ జలజీవన్ పథకం పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఇంకా పంచాయతీకి అప్పగించలేదన్నారు. కాంట్రాక్టర్ స్పందిస్తూ నీటిపంపిణీలో తారతమ్యంగా వ్యవహరించడం లేదని బదులివ్వడం గమనార్హం. నిరసనలో గ్రామస్థులు మునీంద్ర, లక్ష్మణరెడ్డి, పీఆర్ చంద్ర, అశ్వథ్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్‌సీ మంజునాథ్, సరస్వతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో హోలీ సందడి

బొమ్మనహళ్ళి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలి సందర్భంగా పలు చోట్ల యువకులు ఉత్సాహంగా రంగులు చల్లుకుని సరదాగా గడిపారు. పలు ప్రైవేట్ సంస్థలు శుక్రవారం హాఫ్ డే సెలవు ప్రకటించడంతో యువత మరింత ఉత్సాహంగా వేడుకలు చేసుకున్నారు. హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్, బొమ్మనహళ్ళి తదితర ప్రాంతాలలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.




రంగులలో యువత ఇలా...

గుర్తుతెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

చింతామణి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చింతామణి రాష్ట్ర రహదారిపై తళగవార సమీపాన మస్తేనహళ్ళి పారిశ్రామికవాడకు వెళ్లే మలుపులో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో పాదచారి మృతి చెందాడు. ప్రమాదంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో బెంగళూరు గ్రామీణ జిల్లా ఆనేకల్ పట్టణానికి చెందిన శివప్ప (70) మృతి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కైవార సమీపాన లోకేశ్‌కు చెందిన తోటలో కూలి పనిచేసేందుకు వచ్చిన శివప్ప అక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం పని నిమిత్తం తళగవారకు వచ్చిన శివప్ప తిరిగి కైవారకు నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఘటనా స్థలాన్ని కైవార అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై ప్రకాశ్ పరిశీలించారు. మృతదేహాన్ని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు చింతామణి రూరల్ సీఐ శివరాజ్ తెలిపారు.

తలసరి ఆదాయంలో మళ్లీ కలబురగికి చివరిస్థానం

బెంగళూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలకు శక్తి కేంద్రంగా పేరొందిన కలబురగి జిల్లా ఈ ఏడాది కూడా తలసరి ఆదాయంలో చివరిస్థానంలో నిలిచింది. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన 2024-25 రాష్ట్ర ఆర్థిక సమీక్ష ద్వారా ఈ అంశం వెలుగులోకి వచ్చింది. వెనుకబడిన జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలు పోతున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదని గణాంకాలు నిర్ధారిస్తున్నాయి. బెంగళూరు నగర జిల్లాలో తలసరి ఆదాయం రూ.7.38 లక్షలు ఉండగా కలబురగిలో కేవలం రూ.1.43 లక్షలు మాత్రమే ఉంది. కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటక జిల్లాల్లో తలసరి ఆదాయంలో వెనుకబడ్డాయి. బెంగళూరు నగర జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. ఆ తర్వాతిస్థానంలో బెళగావి, మైసూరు విభాగాలు ఉన్నాయి. ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలు, మౌలిక సదుపాయాలు లేకపోవడమే తలసరి ఆదాయం పెరగకపోవడానికి కారణంగా ఉంది. వెనుకబడిన జిల్లాల్లో పరిశ్రమలు ప్రారంభించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా ఉపాధి, ఉద్యోగాలు మెరుగవుతాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బెంగళూరు విభాగంలో రూ.5.01 లక్షలు ఉండగా కలబురగి డివిజన్‌లో రూ.1.73 లక్షలు ఉందంటే బెంగళూరుతో పోలిస్తే మూడింట ఒకవంతు మాత్రమే ఆర్థిక ప్రగతి సాధ్యంగా ఉన్నట్టయ్యింది. ఆర్థిక నిపుణుడు డాక్టర్ డీఎం నంజుండప్ప నివేదిక ప్రకారం రాష్ట్రంలో 39 తాలూకాలు అత్యంత వెనుకబడ్డాయి. అందులో 21 తాలూకాలో కల్యాణ కర్ణాటక పరిధిలో ఉన్నాయి. బళ్ళారి, బీదర్, కలబురగి, కొప్పళ, రాయచూరు, విజయనగర, యాదగిరి జిల్లాలు పరిశ్రమలు లేకపోవడంతో తలసరి ఆదాయం తక్కువగా ఉంది. అయితే రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ 39శాతం మంది కార్మికులు ఈ ప్రాంతానికి చెందినవారే ఉన్నారు. స్థానికంగా పనులు లేక వలసలు పోతుంటారు. బెంగళూరుతోపాటు దక్షిణభారత వ్యాప్తంగా నిర్మాణరంగం పనులలో జిల్లా కూలీలు అత్యధికంగా ఉంటారు. ఈ ప్రాంతంలో శాశ్వతమైన నీటివనరులు లేకపోవడం, కేవలం వర్షాధారిత పంటల సాగు ద్వారా ఆర్థికంగా స్థిరపడలేకపోతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగుల)	1602.32	1,584.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,028	2.041
నీటి నిల్వ (టీఎంసీలు)	24.67	7.03

పాలనలో పెరిగిన అవినీతి

● దాడులు చేసినా అధికారుల్లో మార్పు రావడం లేదు ● ప్రజలు బాధ్యతగా మెలగాలి ● డిప్యూటీ లోకాయుక్త వీరప్ప

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పరిపాలనలో అవినీతిని నియంత్రించడానికి లోక్‌పాల్ బిల్లు, లోకాయుక్త సంస్థను అమలు చేసినప్పటికీ అవినీతి అక్టోపస్ లాగా విస్తృతంగా వ్యాపించిందని, సరిదిద్దకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు తిరుగుబాటు చేసే అవకాశం ఉందని డిప్యూటీ లోకాయుక్త బి.వీరప్ప హెచ్చరించారు. విజయనగరం జిల్లాలో మూడు రోజుల పర్యటన శుక్రవారానికి ముగిసింది. నగరంలోని సహకార సంక్షేమ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి ముందు 95శాతం మంది ప్రజలు దేశ భక్తులు ఉండేవారు. అయితే స్వాతంత్ర్యం తరువాత అవినీతి పెరిగిందన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, ఖాతాలు చేయడంలో జాప్యం, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి తిరుగుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజల నుంచి డబ్బులు ఆశించడం బాధాకరమన్నారు. ఎన్ని దాడులు చేసినా అధికారుల్లో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. హొసపేట బస్‌స్టేషన్‌లో గడువు ముగిసిన శీతల పానీయాలు దొరికాయని ఇక్కడ జరిగిన లోపాలపై కేసు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. ఇక్కడి రాయబసవ కాలువలలోకి మురుగునీరు, అపరిశుభ్రమైన నీరు వదులుతున్నారని, ప్రజలు బాధ్యతాయుతంగా మెలగాలన్నారు. విజయనగరం గత వైభవాన్ని కాపాడుకోవడానికి పరిశుభ్రతను కాపాడుకోవాలన్నారు. ఓటును అమ్ముకోకుండా, సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. స్వాతంత్ర్యానికి ముందు 18 శాతం ఉన్న అక్షరాస్యత రేటు ఇప్పుడు 80శాతం ఉన్నప్పటికీ అవినీతి పెరగడం అన్యాయమన్నారు.ఈసందర్భంగా లోకాయుక్త అదనపు రిజిస్టార్ రాజశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్లు పృథ్వీ, అరవింద్, అబ్దుల్ రెహమాన్ నందగాడి, సీనియర్ న్యాయాధికారి రాజేశ్‌హొసమనె, న్యాయాధికారి శాంతి, జిల్లా కమిషనర్ దివాకర్, విజయనగరం జిల్లా ఎస్పీ హరిబాబు, లోకాయుక్త సిద్దరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్నఉపలోకాయుక్త



వినతి పత్రం అందిస్తున్న దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

బళ్లారి రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నగరంలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల సంఘం జిల్లాధ్యక్షుడు కుమారస్వామి కోరారు. శుక్రవారం పలు డిమాండ్లతో ఏడీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఆంధ్రలో రూ.4వేలు, తెలంగాణలో రూ.6వేలు, మహారాష్ట్రలో రూ.2వేలు పించన్ అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనూ దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఫించన్ రూ.3000 అందజేయాలని కోరారు. ప్రతినెలా మూడో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఢిల్లీ దర్బార్ నుంచి విముక్తి పొందాలి

● ప్రాంతీయ పార్టీలతోనే సుపరిపాలన సాధ్యం: నవ కర్ణాటక నిర్మాణ వేదిక

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ దర్బార్ కింద పని చేస్తాయని, సమస్యల పరిష్కారంలో వారికి చిత్తశుద్ధి ఉండదని, సొంత పార్టీతోనే సుపరిపాలన సాధ్యమని నవ కర్ణాటక నిర్మాణ వేదిక నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలోని బీడీఏ హాల్లో జరిగిన సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్, ఎస్.మూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీల పాలనలో రైతులు, దళితులు, రచయితలు, మహిళా కార్మికులు, విద్యార్థులు, యువత, పర్యావరణవేత్తలు, అంగన్‌వాడీ-ఆశాకార్యకర్తలు, పౌరకార్మికులు అందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యధికులు వీధుల్లోకి వచ్చి తమ హక్కులు, కనీస ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఇప్పటి వరకు, ఈ పార్టీలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా వారి సమస్యలు ఏవీ పరిష్కరించబడలేదన్నారు. జాతీయ పార్టీల పాలనతో కన్నడిగులు విసిగిపోయారన్నారు. ఒకసారి బీజేపీ, మళ్లీ కాంగ్రెస్ జేడిఎస్‌లను ఎంచుకోవడం జరుగుతుంది. కార్యకర్తలు, మేధావులు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నాలు జరపాలన్నారు. 65 సంవత్సరాలు పాలించినా కాంగ్రెస్ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఆర్థిక సమానత్వం తేవడానికి వారు ఎటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. సమ సమాజ నిర్మాణం తన సంకల్పమని, వెనుకబడిన తరగతుల అభివృద్ధి తన కల అని చెప్పే ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎస్‌సీపీ, ఎస్‌టీపీ నిధులను ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారన్నారు. అవినీతి డబ్బునుతీసుకొచ్చి ఇంటింటికీ పంచే వారు దేశభక్తులా అని ఆయన ప్రశ్నించారు. అందుకే అవినీతిపరులను అధికారంలోకి తీసుకురాకూడదని మన ఓట్లతో మనం నిర్ణయించుకోవాలి. అందుకే రాబోయే ఎన్నికల్లో మీరందరూ జాతీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈరోజు నుండి మన స్వంత పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేయలాని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్



కామదేవదహనంలో పాల్గొన్న హిందూ జాగరణ వేదిక సభ్యులు, బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోలీ పండగలో భాగంగా గురువారం రాత్రి నగరంలోని సత్యనారాయణపేటలోని రాఘవేంద్ర స్వామి సర్కిల్లో కామ దేవ దహన కార్యక్రమం జరిగింది.హిందూ జాగరణవేదిక, బీజేపీ పార్టీ నాయకులు ఇందులో పాల్గొన్నారు. శివుని ప్రతిజ్ఞను ఉల్లంఘించిన మన్మధుడిని శివుడు తన మూడో కన్నుతో కాల్చాడని ఒక పురాణం ఉంది. మానవుల్లో కామం అనేది కోరికను సూచిస్తుంది. అలాంటి లక్షణాలను నాశనం చేయడానికి యువకులు కూడా కామాన్ని దహించే కర్మలో పాల్గొంటారని ప్రతీతి. లబోలబో అంటూ కామాన్ని దహించే చర్యలో యువ బృందం సంతోషంగా పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై అట్రాసిటీ కేసు

సిరుగుప్ప, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడిపై అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. సిరుగుప్ప పట్టణ ఎస్సై పరశురామ్ తెలిపిన మేరకు తాలూకాలోని దేశనూర్ గ్రామానికి చెందిన శివరాజ్ అనే యువకుని చితకబాది కులం పేరుతో దూషించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఇద్దరూ శివరాజ్, విక్రమ్‌జైన్ చిన్న విషయంపై వాగ్వాదం చేసుకున్నారు. పట్టణ తెలుగు ప్రాథమిక పాఠశాల వద్ద విక్రమ్‌జైన్ శివరాజ్‌పై దాడికి పాల్పడి నిన్ను ఆరోజే చంపిఉంటే సరిపోయేదని శివరాజ్‌ను బెదిరించారు. ఈకారణంగా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ. హనుమంతప్ప, వెంకటేశ్, ఈకేసును దార్యాప్తు చేపట్టారు. విక్రమ్‌జైన్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఘనంగా తిక్కన్న తాత ఆరాధన



తిక్కన్న తాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సిరుగుప్ప, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తిక్కన తాత ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రవాసాంధ్రులు అధికంగా నివాసం ఉండే విజయనగర కాలనీలో పౌర్ణమి రోజు ఆరాధన నిర్వహించడం ఆనవాయితీ. మఠాధిపతులు సుంకలమ్మ, ఉరుకుందప్ప సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు.

అపారమైన విజ్ఞానం దేశం సొంతం

● తారపాక విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ డేవిడ్ లారోస్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డేవిడ్ లారోస్

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ సాంప్రదాయ పరిశోధనలకు నిలయం, వినూత్న పరిశోధనల ద్వారా ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచిందని దక్షిణ అమెరికా చిలీయ తారపాక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ డేవిడ్ లారోస్ అన్నారు. శుక్రవారం ఆయన యూనివర్శిటీలో సైన్స్ ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ప్రపంచంలో ప్రతిచోటా వ్యాపించిందన్నారు. సైన్స్ రంగానికి భారతీయుల సహకారం అపారమైనదన్నారు. రిజిస్టార్ రుద్రేశ్ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త అవిష్కరణలవైపు కృషి చేయాలన్నారు. దీని వలన వారు పాశ్చాత్యదేశాలకు ప్రయాణించి మరిన్ని పరిశోధనలు చేయడానికి అవకాశం దక్కుతుందన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ మునిరాజు మాట్లాడుతూ.. అమెరికాలో టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, దానిని నెలబెట్టుకోవడంలో భారతీయుల సహకారం అపారమన్నారు. విద్యార్థులు పరిశోధన, అభివృద్ధికి ఎక్కువ ప్రాదాన్యం ఇవ్వాలన్నారు. ప్రపంచలోని నిజమైన సమస్యలను పరిష్కారాలను కనుగొనడం పరిశోధన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఈసందర్భంగా విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దక్షిణ అమెరికాలోని చిలీలోని తారాపాక విశ్వవిద్యాలయం మధ్య ఒక విద్యా ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా ఒక ఒప్పందం కుదిరింది. విద్యార్థులు తయారు చేసిన 50కిపైగా విభిన్న సైన్స్ ప్రయోగాల ప్రదర్శన జరిగింది. ఈసందర్భంగా అప్లైడ్ సైన్స్ డీన్ డా. శశికాంత్, డా.హనుమేరుశ్, అన్నిసైన్స్ విభాగాదిపతులు, సిబ్బంది, వివిధ విభాగాల అధదిపతులు, పరిశోధనా విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యోగినారాయణ తత్వాలను అందరూ గ్రహించాలి: మేయర్



యోగినారాయణకు నివాళులర్పిస్తున్న మేయర్ నందీశ్, సంఘం ప్రముఖులు

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి మంచి సందేశాన్ని బోధించిన యోగి నారాయణ యతీంద్రులు కాలదార్శనికులు, ప్రతిఒక్కరూ ఆయన ఆదర్శ లక్షణాలను స్వీకరించి సన్మార్గంలో నడవాలని నగర మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వడ్డరబండిలోని బలిజ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన యోగినారాయణ యతీంద్ర కైవార తాతయ్య జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కైవార తాతయ్య ఓ సమాజానికి పరిమితం కాదని, కుల,మత, తెగ వివక్షను ఖండించారని, అణగారిన దళితుల దోపిడీకి గురైన వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. విశ్వమానవత్వ సందేశాన్ని ప్రభోదించిన నారాయణ యతీంద్రుని జరుపుకోవడం అర్థవంతమైనది, గొప్ప నాయకుల ఆదర్శ లక్షణాలను ప్రతిఒక్కరూ తమ జీవితంలో అలవర్చుకోవాలని ఆయన అన్నారు. ప్రస్తుత యువతరం మొబైల్ ఫోన్లకు బానిసలైంది. శరణులు, దాసుల అద్భుత కార్యాల గురించి మనం ఎలా తెలుసుకోగలం అని ఆయన విచారం వ్యక్తం చేశారు. శరణుల జీవిత ప్రణాళికల గురించి తరువాతి తరానికి తెలియజేసే పని జరగాలని ఆయన అన్నారు. కైవార తాతయ్య జయంతిలో భాగంగా నగరంలో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఊరేగింపును మేయర్ ముల్లంగి నందీశ్ జెండా ఊపి ప్రారంభించారు. బలిజ భవన్‌నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు రాఘవేంద్ర సినిమా థియేటర్, గడిగ చెన్నప్పసర్కిల్, మీనాక్షి సర్కిల్ మీదుగా బలిజ భవన్ వేదిక హాలుకు తిరిగి చేరుకుని వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజుతోపాటు సంఘం నాయకులు, ప్రముఖులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి నగరంలో సంబరాలు జరుపుకుంటున్న యువతులు

హొసపేట జిల్లా స్టేడియంలో..



ఉత్సాహంగా రంగుల పండుగ..

బళ్లారి సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోలీపండుగను పురస్కరించుకుని శుక్రవారం విజయనగరం జిల్లావ్యాప్తంగా రంగురంగుల హోలి నిర్వహించారు. హొసపేట నగరంలోని జిల్లాస్టేడయంలో వేలాది మందిప్రజలు గుమిగూడి సంబరాలు జరుపుకున్నారు. బళ్లారి నగరంలోని ఫ్రీడమ్ పార్క్‌లో పతంజలి యగా కమిటీ హోలీ వేడుకలను జరుపుకుంది. ఉదయం యెగా చేసిన తర్వాత ఒకరినొకరు రంగులు వేసుకుని పాటలక అనుగుణంగా నృత్యం చేశారు. పతంజలి యువ భారత్ రాష్ట్ర ఇన్‌చార్జి ప్రొఫెసర్ హళ్ళికేరి తదితరులు పాల్గొన్నారు. నగర నడిబొడ్డున ఉన్న సత్యనారాయణపేటలో హిందూ జాగరణ వేదిక ఆధ్వర్యంలో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌కుమార్ ఉత్సవాలను ప్రారంభించారు. బీజేపీ రైతు మోర్చా అధ్యక్షుడు గణపాల్ ఐనాథ్‌రెడ్డి, హిందూజాగరణ వేదిక, భరత్‌లాల్ సోని, అర్జున్‌బాయి, రేల్వే యాక్షన్ కమిటీ మహేశ్వరస్వామి,వెంకటేశ్వర్లు, శబరి రవి, రాయచంద్రప్ప, జనతా బజార్ అధ్యక్షుడు వేమన్న, కార్పోరేటర్ అశోక్ పాల్గొన్నారు.



సత్యనారాయణ పేటలో..

హోసూరు జోన్

నాలెడ్జ్ కారిడార్ ప్రకటనపై హోస్టియా హర్షం

హోసూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోసూరును సైతం నాలెడ్జ్ కారిడార్‌గా తీర్చిదిద్దేలా 2025-26 బడ్జెట్‌లో రూ.400 కోట్లతో టైడెల్ పార్కు నిర్మాణం చేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడంపై హోసూరు స్మాల్ అండ్ టిని ఇండస్ట్రీస్ అసోసియేషన్ (హోస్టియా) అధ్యక్షుడు మూర్తి హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎంఎస్‌ఎంలకు 2.5 లక్షల కోట్ల రుణాలతో కృష్ణగిరి జిల్లాలో కొత్త వృత్తి శిక్షణా కేంద్రాల ఏర్పాటు. రూ.366 కోట్లతో తమిళనాడులోని 9 ప్రదేశాల్లో 398 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక వాడల నిర్మాణం, రూ.225 కోట్ల కేటాయింపుతో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను పెంచే పథకం, హోసూరు నగరానికి అవసరమైన వాటిలో ఒకటిగా సీఎం ప్రకటించారన్నారు. నగరాలకు అనుబంధంగా హైవేలను విస్తరింపచేయడంలో భాగంగా పారిశ్రామిక వాడ హోసూరులో టైడెల్ పార్క్‌ను అభివృద్ధి చేయదలిచినట్లు సీఎం తన బడ్జెట్‌లో పేర్కొన్నారన్నారు. 5లక్షల చదరపు అడుగులలో రూ.400కోట్లతో వచ్చే ఏడాది విరుదునగర్‌లో టైడెల్ కారిడార్ విస్తరించనుందని, తద్వారా 6వేలమందికిపైగా ఉపాధి సాధ్యమని ప్రకటించడం స్వాగతిస్తున్నట్లు తెలిపారు.



హోస్టియా అధ్యక్షుడు మూర్తి

గొర్రెల కాపరులకు రక్షణ కల్పించాలి

● సంగొళ్లిరాయన్న సంఘం ఆధ్వర్యంలో ధర్నా



ఏడీసీ మహమ్మద్‌జుబేర్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

బళ్లారి రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బాగల్‌కోట జిల్లా బాదామి తాలూకా ఉండలవాడ గ్రామంలో గొర్రెల కాపరి శరణప్ప జంబనగట్టిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, కాపర్ల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కన్నడ క్రాంతివీర సంగొళ్ళిరాయన్న సంఘం అధ్యక్షుడు బట్టి ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం పదాధికారుల నేతృత్వంలో మయూర హోటల్ సమీపం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం చేరుకుని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్‌జుబేర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్రెల కాపర్లుకు రక్షణ కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం గన్ లైసెన్స్‌లు అందజేయాలని, అదే విధంగా పలుఫారెస్ట్ ప్రాంతాల్లో గొర్రెలను ఆపుకునేందుకు స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రవికారమంచి, విరూపాక్షి, శేఖర్, శివకుమార్, కట్టెప్ప, అనుండి పరమేశ్, శాంతి నగర్ మల్లి, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రచూడేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హోసూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హోసూరులో ప్రసిద్ధి చెందిన మరగతాంబ చంద్రచూడేశ్వర ఆలయ వార్షిక ఉత్సవాలలో భాగంగా పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత వినాయకునికి పూజలు ప్రారంభించి తేరుపేటలోని రథాలపై ఉత్సవమూర్తులను కొలువు దీర్చారు. రథోత్సవంలో కృష్ణగిరి జిల్లా కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఆరోగ్యస్థాయి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్, బీజేపీ అధ్యక్షుడు నాగరాజులు పెద్దరథాన్ని లాగారు. భక్తాదులు హర హర మహదేవా, శంభో శివ శంభో అంటూ రథాన్ని లాగారు. వివిధ సంస్థల వారు, తదితరులు భక్తులందరికీ వారందరికి వడపప్పు, పానకం, మజ్జిగ, పుచ్చకాయలు, వివిధ రకాల అన్నప్రసాదాలు అందించారు. రథోత్సవం సందర్భంగా హోసూరు మొత్తం సంబరాలతో మారుమోగింది. 16న తెప్పోత్సవం జరుగనుండగా ఉత్సవాలు 27 వరకు కొనసాగనున్నాయి. డీఎస్పీ సింధు ఆధ్వర్యంలో 500 మందికి పైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 100కుపైగా సీసీ కెమరాలు అమర్చారు. దర్శనం పొందేందుకు ఒక దారి, బయటికి వెళ్లేందుకు మరో దారిని అమర్చారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మనోహరన్, ఎంపీ.గోపినాథ్, రాష్ట్ర మైనార్టీ హక్కుల విభాగం ఉప కార్యదర్శి విజయకుమార్, జనరల్ కమిటీ సభ్యుడు శ్రీనివాసన్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సంపంగి, మధు, ప్రేమనాథ్, శ్రీనివాసమూర్తి, ఆనంద కుమార్, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.



మరగతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

హోసూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతా వారోత్సవంలో భాగంగా నగరంలోని కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు ఇతర వాహనచోదకులు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో హోసూరు పోలీసులు, కావేరి ఆసుపత్రి అరవిందన్, దాన్యం జోష్, వర్గీస్ జాయ్ విందుకుమారి, శ్రీరామజయం తదితరులు పాల్గొన్నారు.